సాక్షి తిరుపతి

మంగళవారం । 11 । జూలై । 2023



'భద్రత' పాటించకుంటే ప్రమాదం

రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించకుంటే ప్రమాదాల బారినపడతారని ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. - 8లో



ఐదుగురికి గాయాలు

తిరుపతి రూరల్ మండలంలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను రుయాకు తరలించారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	32	25
తిరుపతి	32	25
తిరుమల	28	22
గూడూరు	35	27
నగరి	33	26

న్యూస్‌రీల్

13 నుంచి కోదండరాముని పవిత్రోత్సవాలు



బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

తిరుపతి కల్చరల్ : తిరుపతిలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. సోమవారం టీటీడీ పరిపాలన భవనంలో టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి చేతుల మీదుగా ఉత్సవాల బుక్‌లెట్ ఆవిష్కరించారు. ముందుగా 12వ తేదీ బుధవారం సాయంత్రం పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. గురువారం యాగశాలలో పవిత్ర ప్రతిష్ట, శయనాధివాసం చేపట్టనున్నారు. శుక్రవారం పవిత్ర సమర్పణ, యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 15వ తేదీన పూర్ణాహుతితో పవిత్రోత్సవాలను పరిపూర్ణం చేయనున్నారు. ఈ సందర్భంగా ప్రతి రోజు ఉదయం స్నపన తిరుమంజనం, సాయంత్రం తిరువీధి ఉత్సవం జరిపించనున్నారు. బుక్‌లెట్ ఆవిష్కరణలో కోదండరామస్వామి ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చలపతి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: అత్యుత్తమ ప్రతిభకనబరిచే విభిన్న ప్రతిభావంతులు(దివ్యాంగులు) భారత ప్రభుత్వం అందించే జాతీయ పురస్కారాలను పొందడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆ విభాగం సహాయ సంచాలకులు శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. ఆసక్తి గలవారు ఆన్‌లైన్‌లో డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఏడబ్ల్యుఆర్‌డీఎస్.జీవోవీ.ఇన్ వైబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు.

గురుకుల పాఠశాలలో మంత్రి తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మంత్రి

చిల్లకూరు: మండల కేంద్రంలోని అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలను మంత్రి మేరుగ నాగార్జున సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు భోజనం చేసే ప్రాంతం, వంట గది, క్లాస్ రూములు, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. డార్మెటరీలో విద్యుత్ తీగలు వేలాడుతూ ఉండడంపై మండిపడ్డారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి మెనూ సక్రమంగా అమలు చేస్తున్నారా అని ఆరా తీశారు. మంత్రి మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలికవసతులు కల్పించేందుకు గురుకుల సెక్రటరీని పంపనున్నట్లు తెలిపారు. ఔట్ సోర్సింగ్‌లో పని చేసే వారు జీతాలు రాలేదని చెప్పడంతో ఏజెన్సీని మార్చేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. మద్యం సేవించి విధులకు హాజరైన పాఠశాల అటెండర్ సురేష్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బందితోపాటు రూరల్ సీఐ దశరథరామారావు, ఎస్ఐ గోపాల్ పాల్గొన్నారు.

నేడు జిల్లాకు పలువురు గవర్నర్లు రాక

తిరుపతి అర్బన్: జిల్లాకు మంగళవారం పలు రాష్ట్రాల గవర్నర్లు విచ్చేయనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ ఉదయం 11:45 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని తిరుపతి తాజ్ హోటల్‌లో విశ్రాంతి తీసుకుంటారని చెప్పారు. మధ్యాహ్నం 3:30 గంటలకు తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారన్నారు సాయంత్రం 5.45 గంటలకు తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని సేవించుకుని తాజ్ హోటల్‌కు వెళతారని వివరించారు. బుధవారం ఉదయం 10 గంటలకు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మధ్యాహ్నం 2.30 గంటలకు తిరుగుప్రయాణం కానున్నారని తెలిపారు. అలాగే అస్సాం గవర్నర్ గులాబ్ చంద్ కటారియా మంగళవారం రాత్రి తిరుమలలో బస చేయనున్నట్లు పేర్కొన్నారు. బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని, అనంతరం తిరుపతిలో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం కార్యక్రమానికి హాజరుకానున్నట్లు వెల్లడించారు. గురువారం రాత్రి 8.20 గంటలకు తిరుగు ప్రయాణం కానున్నారని వివరించారు. మేఘాలయ గవర్నర్ ఫగు చౌహాన్ బుధవారం సాయంత్రం 4 గంటలకు తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకుంటారని చెప్పారు. మరుసటి రోజు తిరుగుప్రయాణం కానున్నట్లు వివరించారు.

భగ్గుమన్న 'సేవా సైన్యం'

రాజకీయాల్లో నేతలకు పరిణితి ఉండాలి.. సమాజానికి ప్రయోజనం చేకూర్చేలా కార్యాచరణ పాటించాలి.. ప్రజా సమస్యలను పూర్తిస్థాయి అవగాహనతో ప్రస్తావించగలగాలి.. విమర్శలు చేసేముందు వాస్తవాలను తెలుసుకోవాలి.. నైతిక విలువకు కట్టుబడి ఆరోపణలు గుప్పించాలి.. అయితే కొందరు పదవుల కోసమే పాలిటిక్స్‌లోకి వస్తున్నారు.. ఉనికిని కాపాడుకునేందుకు దిగజారి ప్రవర్తిస్తున్నారు.. ఇందుకు తాజాగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలే నిదర్శనమని పలువురు మేధావులు వెల్లడిస్తున్నారు. ప్రభుత్వానికి.. ప్రజలకు నడుమ వారధులుగా సేవలందిస్తున్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని ఎమ్మెల్యేలు, నేతలు మండిపడుతున్నారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న తమను అవమానించడంపై సేవా సైనికులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- పవన్ కల్యాణ్ ఆరోపణలపై వలంటీర్ల ఆగ్రహం
- అనుచిత వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని డిమాండ్
- సంక్షేమ వారధులకు మద్దతుగా నిలిచిన ఎమ్మెల్యేలు, నేతలు, ప్రజాసంఘాలు
- జనసేన అధినేతకు రాజకీయ సమాధి తప్పదని హెచ్చరిక



పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు నిరసనగా పుత్తూరు పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద మానవహారం నిర్వహిస్తున్న వలంటీర్లు, సచివాలయ సిబ్బంది



రాపూరు : సిద్ధవరంలో పవన్ దిష్టిబొమ్మ దహనం

తిరుపతి మంగళం/చిత్తూరు కార్పొరేషన్/బంగారుపాళెం/సైదాపురం/బైరెడ్డిపల్లె : జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆదివారం రాత్రి ఏలూరులో నిర్వహించిన బహిరంగ సభలో చేసిన వ్యాఖ్యలను వలంటీర్లతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు, ప్రజా సంఘాల వారు తీవ్రంగా ఖండించారు. వలంటీర్లపై ఆరోపణలు చేస్తే పవన్‌కు రాజకీయ సమాధి తప్పదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వాల పాలనతో పింఛన్ తీసుకోవాలంటే వృద్ధులు, దివ్యాంగులు గంటల తరబడి క్యూలో ఉండాల్సి వచ్చేదని, వలంటీర్ వ్యవస్థ వచ్చిన తర్వాతే వారి ఇక్కట్లు తప్పాయని వెల్లడించారు. ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలను చేరుకున్న వలంటీర్లను అమ్మాయిలను అపహరించే ముఠాగా పేర్కొనడమంటే ప్రజావ్యవస్థనే అవమానించినట్లని వివరిస్తున్నారు.

ప్రజాస్వామ్యానికే అవమానం



ప్రతి నెలా ఒకటో తేదీనే సామాజిక పింఛన్లు పంపిణీ చేసే వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణం. జనరంజకంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని దూషించడమంటే ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే. పవన్ కల్యాణ్‌కు ఉన్న రాజనీతి, రాజకీయ పరిణితి కోడి బుర్రతో సమానం. ప్రజా సేవకులపై నోటికొచ్చినట్లు మాట్లాడితే పవన్ కల్యాణ్‌కు రాజకీయ సమాధి తప్పదు.

– భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్యే, తిరుపతి

నిందలేస్తే మూల్యం తప్పదు



ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న వలంటీర్లపై పవన్ కల్యాణ్ నిందలేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సైతం సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల పనితీరుపై ప్రశంసలు కురిపించారు. కోవిడ్ సమయంలో వైరస్ సోకిన వారి ఇళ్లకు వెళ్లి మరీ వలంటీర్లు సేవ చేసి, ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు. ఇదే విధంగా మాట్లాడితే పవన్‌కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారు.

– ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్యే, చిత్తూరు

పవన్‌కు అస్సలు అర్హత లేదు



జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు వలంటీర్ల గురించి మాట్లాడే అర్హత అస్సలు లేదు. ప్రజా సంక్షేమం కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థ తీసుకువచ్చారు. ఆ మేరకే వారు సైతం చిత్తశుద్ధితో సేవలందిస్తున్నారు. జనం కోసం పనిచేస్తున్న వలంటీర్లపై ఇష్టారాజ్యంగా మాట్లాడడం సబబు కాదు. ఇలా తప్పుడు ఆరోపణలు చేయడం సమాజానికి కూడా మంచిది కాదు.

– ఎంఎస్ బాబు, ఎమ్మెల్యే, పూతలపట్టు

విశిష్ట సేవలపై విషం



రాష్ట్రంలో విశిష్ట సేవలందిస్తున్న వలంటీర్లపై విషం కక్కడం భావ్యం కాదు. వెంటనే పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలి. ప్రాణాలను కూడా లెక్కచేయకుండా కోవిడ్ సమయంలో వలంటీర్లు 16 వేల కోట్ల మాస్కులు అందించారు. ప్రజలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్న పవన్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు.

– కోనేటి ఆదిమూలం, ఎమ్మెల్యే, సత్యవేడు

ఇది చంద్రబాబు స్క్రిప్ట్



చంద్రబాబు స్క్రిప్ట్ ప్రకారమే పవన్ కల్యాణ్ మాట్లాడుతున్నారు. చిత్తశుద్ధి ఉంటే ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని తెలుసుకోవాలి. మహిళలపై పవన్‌కు ఎప్పుడూ గౌరవం లేదు. నిత్యం జనంతో మమేకమై సంక్షేమ ఫలాలను క్షేత్రస్థాయిలో అర్హులందరికీ చేరుస్తున్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణం. దీనిపై వలంటీర్లకు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలి. ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా పనిచేస్తున్న వారిని దూషించడం మానుకోవాలి.

– ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్



నగరి మండలం ఓజీ కుప్పంలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వలంటీర్లు

పవన్ వ్యాఖ్యలు సిగ్గుచేటు



రాష్ట్రంలో ఒంటరి మహిళలు, వలంటీర్లను కించపరుస్తూ పవన్ కల్యాణ్ మాట్లాడడం సిగ్గుచేటు. ప్రతి నెలా ఒకటో తేదీనే తలుపు తట్టి పింఛన్ అందిస్తున్న వలంటీర్లంటే అవ్వాతాతలకు సైతం ఎంతో అభిమానం. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారుల ఇంటి ముంగిటే చేరుస్తున్న సైనికులు వలంటీర్లు. వారిని కించపరిచేలా వ్యాఖ్యానించడం దారుణం.

– మొగసాల రెడ్డెమ్మ, డీసీసీబీ చైర్‌పర్సన్, చిత్తూరు

నోరు అదుపులో పెట్టుకోవాలి



దత్తపుత్రుడు, ప్యాకేజీ స్టార్ పవన్ కల్యాణ్ నోరు అదుపులో పెట్టుకోవాలి. లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ విశేషంగా సేవలందించే వలంటీర్లను దూషిస్తే ఎవరూ హర్షించరు. ఇప్పటికైన పవన్ తన ప్రవర్తన మార్చుకుని వలంటీర్లకు క్షమాపణ చెప్పాలి. లేకుంటే జనమే ఆయనపై తిరుగుబాటు చేస్తారు.

– చిన్నబ్బ, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు, చిత్తూరు

ఇంట్లో మనిషిలా చూస్తున్నారు



నాలుగేళ్లుగా వలంటీర్‌గా పనిచేస్తున్నా. నా పరిధిలోని ప్రతి ఒక్కరూ నన్ను తమ ఇంట్లో మనిషిలానే చూస్తున్నారు. పథకాలపై ఎలాంటి సందేహం వచ్చినా వెంటనే ఫోన్ చేస్తున్నారు. మాకు ప్రభుత్వం అందిస్తున్న వేతనం కంటే ప్రజలు ఇస్తున్న మర్యాదే ఎక్కువ. సంక్షేమ ఫలాలను వారికి అందించినప్పుడు కలిగే ఆనందాన్ని మాటల్లో చెప్పలేం. అలాంటిది మామీద పవన్‌కల్యాణ్ ఆరోపణలు చేయడం అన్యాయం. ఆయన వెంటనే క్షమాపణలు చెప్పాలి.

– లక్ష్మి, వలంటీర్, చిత్తూరు

కేంద్ర పథకం కోసం సర్వే



కోవిడ్ సమయంలో కుటుంబసభ్యులను కోల్పోయి ఒంటరిగా మిగిలిపోయిన మహిళలను ఆదుకునేందుక కేంద్ర ప్రభుత్వం ఓ ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టింది. వారి కోసం క్షేత్రస్థాయిలో సర్వే చేశాం. అయితే సర్వేలో లబ్ధిదారుల వ్యక్తిగత విషయాలను ఆరా తీయలేదు. హ్యూమన్ ట్రాఫికింగ్ అంటూ కేంద్ర నిఘా సంస్థ చెప్పిందంటూ పవన్ అసత్యాలు మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందిస్తున్న మాపై ఇలాంటి ఆరోపణలు చేయడం తగదు.

– చాముండేశ్వరి, వలంటీర్, చిత్తూరు



తిరుపతిలో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న జేసీఎస్ నేతలు



నగరి మున్సిపల్ కార్యాలయం వద్ద వలంటీర్ల నిరసన



నారాయణవనంలో పవన్ కల్యాణ్ ఫొటోను దహనం చేస్తున్న వలంటీర్లు, నేతలు

హరినామము కడు ఆనందకరము

– వైభవంగా భజన మండళ్ల శోభాయాత్ర



మాట్లాడుతున్న దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు



గోవిందరాజస్వామి ఆలయం వద్ద భజన మండళ్ల సభ్యుల శోభాయాత్ర

తిరుపతి కల్చరల్: శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవంలో భాగంగా తొలి రోజు సోమవారం సాయంత్రం టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక తిరుపతి నగరంలో భజన మండళ్ల శోభాయాత్ర అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవాలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. తిరుపతి రైల్వేస్టేషన్ వెనుకనున్న మూడో సత్రం ప్రాంగణంలో మండళ్లతో సామూహిక భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సంకీర్తనాలాపన, ధార్మిక సందేశం అందించారు. కాగా సాయంత్రం 4 గంటలకు శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయం వద్ద టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు పూజలు నిర్వహించి శోభాయాత్రను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ హరినామ సంకీర్తన ప్రజల్లో అశాంతిని దూరం చేస్తుందన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన 3,500 మందికిపైగా భజన మండళ్ల సభ్యులు శ్రీగోవిందరాజస్వామి ఆలయం నుంచి శోభాయాత్రగా మూడో సత్రం ప్రాంగాణానికి చేరుకున్నారు. సాయంత్రం సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 12వ తేదీ బుధవారం ఉదయం 4.30 గంటలకు అలిపిరి పాదాల మండపం వద్ద మెట్ల పూజ నిర్వహించనున్నారు.

అక్కసుతోనే..అడ్డగోలు రాతలు!

- పోలీసుల సమక్షంలోనే ఇసుక అక్రమ రవాణా అంటూ అసత్య కథనాలు
- తప్పుడు ఆరోపణలను ఖండించిన అధికారులు

ఫ్యాక్ట్ చెక్

తిరుపతి రూరల్ : ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండకూడదు. అధికారికంగా అనుమతులు ఉన్నా స్వార్థ ప్రయోజనాల కోసం స్థానికులను రెచ్చగొట్టాలి. అభివృద్ధి పనులు ఎట్టి పరిస్థితుల్లోనూ ముందుకు సాగకూడదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను విషపు రాతలతో విమర్శించాలి. ఇదే లక్ష్యంతో ఈనాడు దినపత్రిక అసత్య కథనాలకు తెగబడింది. ప్రభుత్వం చేపట్టిన నిర్మాణాల కోసం ఇసుక తరలించడాన్ని కూడా తప్పు పట్టింది. పైగా పోలీసుల సమక్షంలోనే ఇసుక అక్రమ రవాణా అంటూ సోమవారం ప్రచురించింది. దీనిపై ఎస్పీ పరమేశ్వర రెడ్డి, చంద్రగిరి తహసీల్దార్ శిరీష ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవాలన వక్రీకరించారని మండిపడ్డారు.

వాస్తవాలు ఇవీ..

రాష్ట్రంలో ఇసుక తవ్వకాలను జేపీ సంస్థకు ప్రభుత్వం అప్పగించింది. ఈ క్రమంలో చంద్రగిరి నియోజకవర్గంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం, నాడు–నేడు పనులతో పాటు దాదాపు రూ.120 కోట్లకు పైగా సాగుతున్న అభివృద్ధి పనులకు జేపీ సంస్థ ఇసుక సరఫరా చేస్తోంది.తహసీల్దార్ శిరీష అనుమతితో జేపీ బృందం ఈ నెల 5వ తేదీ నుంచి మండలంలోని రెడ్డివారిపల్లె వద్ద స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకాలను ప్రారంభించింది. ఈ తరుణంలో టీడీపీ నాయకులు కుట్రలకు తెరతీశారు. ముందుగా గ్రామస్తులను రెచ్చగొట్టారు. ఇసుక రవాణాపై ఉద్దేశపూర్వకంగా ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకొని, పనులను మరింత ఆలస్యం చేసి సమస్యలు సృష్టించాలని చూశారు. అందులో భాగంగా జేపీ సంస్థకు చెందిన వాహనాలను, టిప్పర్లు, హిటాచీలను అడ్డుకున్నారు. దీనిపై తహసీల్దార్ ఫిర్యాదు చేయడంతో చంద్రగిరి పోలీసులు ఐపీసీ సెక్షన్ 341, 506 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రభుత్వ పథకాలు పూర్తి చేసేందుకు ఇసుక తవ్వకాలు సజావుగా జరిగేలా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని తహసీల్దార్ కోరడంతో రెడ్డివారిపల్లిలో పోలీసు బలగాలను ఏర్పాటు చేశారు. అయితే ఈనాడు పత్రికలో మాత్రం పోలీసుల సమక్షంలోనే ఇసుక తవ్వకాలు చేస్తున్నారంటూ తప్పుడు వార్త రావడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

క్లుప్తంగా

ప్రతిభకు పురస్కారం



పురస్కారాలు అందుకున్న మంగళం డిపో డ్రైవర్లు, కండక్టర్లు

తిరుపతి అర్బన్: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన సిబ్బందికి ఆర్టీసీ అధికారులు సోమవారం ప్రత్యేక పురస్కారాలను అందజేశారు. జిల్లాలోని 11 డిపోలకు సంబంధించి డీజిల్ ఆదా చేసిన 95 మంది డ్రైవర్లు, అధిక రాబడి తీసుకువచ్చిన 105 మంది కండక్టర్లకు ప్రతిభ అవార్డులు అందజేశారు. సోమవారం ఈ మేరకు మంగళం డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎం భాస్కర్‌రావు, అసిస్టెంట్ డీఎం నిర్మల చేతుల మీదుగా 20 మందికి పురస్కారాలు ప్రదానం చేశారు.

హత్య కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

తిరుపతి లీగల్ : తిరుపతి కొర్లగుంటకు మారుతీ నగర్‌కు చెందిన టి.ఈశ్వర్ అనే నిందితుడికి హత్యకేసులో ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ పదో అదనపు జిల్లా జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి, స్థానిక ఐదో అదనపు జిల్లా జడ్జి అన్వర్‌బాషా సోమవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోటేశ్వరరెడ్డి, మానిటరింగ్ అధికారి ఈశ్వర్ కథనం మేరకు.. నిందితుడు ఈశ్వర్ అతని తమ్ముడు గిరి చెడు వ్యసనాలకు అలవాటుపడ్డారు. ఇద్దరు తిరుపతి ఎస్వీ నగర్‌లోని ఓ గదిని అద్దెకు తీసుకుని కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. 2021 అక్టోబర్ 18వ తేదీ సాయంత్రం ఇద్దరూ మద్యం తాగి ఘర్షణ పడ్డారు. ఈశ్వర్ సిమెంటు ఇటుక తీసుకుని దాడి చేయడంతో గిరి మృతి చెందాడు. ఈ మేరకు . కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడు ఈశ్వర్‌కు శిక్ష విధించారు.

ప్రమాదరహితంగా 'తిరుమల ఘాట్'



మాట్లాడుతున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

తిరుమల: శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులు ఘాట్‌రోడ్లలో ప్రమాదాల బారిన పడకుండా కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు చేయాలని టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి ఆదేశించారు. సోమవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ రెండు ఘాట్ రోడ్లలో ప్రమాదాల నివారణకు ఎస్పీతో చర్చించి పకడ్బందీ కార్యాచరణకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఘాట్‌లో ప్రమాదం జరిగిన వెంటనే స్విమ్స్, బర్డ్, శ్రీపద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రి అధికారులను అప్రమత్తం చేయాలని సూచించారు. క్షతగాత్రులకు త్వరితగతిన చికిత్స అందించేందుకు యాక్షన్ టీమ్ సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. స్విమ్స్ వద్ద పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని కోరారు. అవ్వాచారికోన, కపిలతీర్థం పైభాగంలోని మాల్వాడి గుండం వద్ద హెచ్చరిక బోర్డులు ఉంచాలని చెప్పారు. ఘాట్ రోడ్లలోని ప్రమాదకర ప్రాంతాల్లో కట్టుదిట్టంగా నిఘా పెట్టాలన్నారు. ఇందుకోసం టీటీడీ సెక్యూరిటీ పోస్టులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తిరుమలలో భక్తులను చేరవేసే ధర్మరథాలను రద్దీ ఉండే చోట్ల ఎక్కువగా తిప్పాలని సూచించారు. అలిపిరి, జీఎస్సీ టోల్ గేట్లు తెరిచే సమయంలో బస్సులు అధిక వేగంగా వెళ్లకుండా ఆర్టీసీ అధికారి పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో సీవీఎస్ఓ నరసింహకిషోర్, సీఈ నాగేశ్వరరావు, రవాణా విభాగం సీఎం శేషారెడ్డి, డీఎఫ్ఓ శ్రీనివాసులు, ఎస్టేట్ స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జున, శ్రీ పద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రి డైరెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, బర్డ్ ఆర్ఎంఓ కిషోర్, స్విమ్స్ రామ్, డీఎంహెచ్ ఓ శ్రీహరి, డీటీసీ సీతారామిరెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి జితేంద్రనాథ్ రెడ్డి, తిరుమల ఏఎస్పీ మునిరామయ్య, ట్రాఫిక్ డీఎస్పీ కొండయ్య, వీజీఓ మనోహర్ పాల్గొన్నారు.

'భద్రత' పాటించకుంటే ప్రమాదం



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి సమీపంలోని మిట్టకండ్రిగ వద్ద ఆదివారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాద ఘటనాస్థలాన్ని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు పాటించకుంటే ప్రమాదాల బారిన పడతారని తెలిపారు. ఒకేసారి ఆరుగురు మరణించడం బాధాకరమన్నారు. అలసట, నిద్రమత్తు కారణంగానే ఇన్ని ప్రాణాలు పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత వాహనాలను డ్రైవింగ్ చేసుకుంటూ సుదీర్ఘ ప్రయాణాలు చేయడం శ్రేయస్కరం కాదని వెల్లడించారు. రమేష్ కుటుంబ సభ్యులు విజయవాడ నుంచి శుక్రవారం రాత్రి ప్రయాణించి తిరుమలకు చేరుకున్నారన్నారు. రెండు రోజులపాటు సరిగా నిద్ర లేక బాగా అలసిపోవడమే ఆరుగురి ప్రాణాలు తీసిందని తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారు విశ్రాంతి తీసుకునేందుకు సమయం కేటాయించాలని సూచించారు. సీట్ బెల్ట్ తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఏరియా వైద్యశాలకు చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. ప్రభుత్వ ఖర్చులతో మృతదేహాలను వారి సొంత ఊర్లకు పంపుతున్నట్లు ఆర్డీఓ రామారావు తెలిపారు. అలాగే మృతులకు సంబంధించిన బంగారు నగలు, బ్యాగులు, ఐడీ కార్డులను వారి బంధువులకు అప్పగించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కులశేఖర్, రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్, సీఐ అంజుయాదవ్, కమిషనర్ బాలాజీనాయక్, తహసీల్దారు ద్వారకనాథరెడ్డి పాల్గొన్నారు.

కల్పవృక్ష వాహనంపై కోదండరాముడు



కల్పవృక్ష వాహనంపై స్వామివారు

తవణంపల్లె: టి.పుత్తూరులోని కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారు కల్పవృక్ష వాహనంపై దర్శనమిచ్చారు. ఈసందర్భంగా ఉదయం సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం తిరుమంజనం, పాలాభిషేకం చేశారు. సాయంత్రం ఊంజల్ సేవ జరిపించారు. రాత్రి సర్వాలంకాభూషితుడైన కోదండరామస్వామివారిని కల్పవృక్ష వాహనంపై కొలువుదీర్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం రాత్రి కోదండరాములవారికి తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు నేడు కోదండరామాలయంలో తెప్పోత్సవం వంశపారంపర్య ధర్మకర్త సిద్ధేశ్వర రెడ్డి తెలిపారు.

అడమార్ మఠం పీఠాధిపతికి చిన్న మర్యాద



శ్రీవారి ఆలయంలో అడమార్ మఠం పీఠాధిపతి విశ్వప్రియ తీర్థ స్వామీజీ

తిరుమల: ఉడిపిలోని అడమార్ మఠం పీఠాధిపతి విశ్వప్రియ తీర్థ స్వామీజీకి సోమవారం టీటీడీ శ్రీవారి ఆలయం తరఫున చిన్నమర్యాద చేశారు. శ్రీవారి ఆలయం వద్ద టీటీడీ అర్చకస్వాములు, టీటీడీ ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం ఇస్తికఫాల్ స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామితో పాటు వారి శిష్య బృందం కూడా ఉంది.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు



పార్టీలో చేరిన నేతలతో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల : మండలంలోని ఆదినపల్లెకు చెందిన టీడీపీ నేతలు సోమవారం చంద్రగిరి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఇరంగారిపల్లి పంచాయతీలో నిర్వహించిన గడప గడపకు మహా పాదయాత్రలో భాగంగా వారికి మోహిత్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన నేతలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలే తమను ఆకర్షించినట్లు వెల్లడించారు. వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని స్పష్టం చేశారు. పార్టీలో చేరిన వారిలో కె.బాలకృష్ణమనాయుడు, విజయ్‌కుమార్, డి.మోహన్‌నాయుడు, మొగిలీశ్వర్‌నాయుడు, పరదేశినాయుడు, రామకృష్ణనాయుడు, అప్పస్వామి, కె.మోహన్‌నాయుడు, తులసీనాయుడు, కన్నాచ్చారి, తేజ చౌదరి, షణ్ముగ ఆచ్చారితోపాటు మరో 40 మంది ఉన్నారు. ఈ క్రమంలో ఆదినపల్లెలో ఏళ్ల తరబడి గ్రామస్తులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించిన మోహిత్‌రెడ్డిని స్థానికులు ఘనంగా సత్కరించారు. అడిగిన వెంటనే బోరు వేయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు



గాయాలతో గుంటూరు వాసులు

తిరుపతి రూరల్: మండల పరిధిలో సోమవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు గాయపడ్డారు. వివరాలు.. మహబూబ్‌నగర్ నుంచి సిమెంట్ లోడ్‌తో వచ్చిన లారీ చంద్రగిరిలో అన్‌లోడ్ చేసి తిరిగి వెళుతుండగా వకుళమాత ఆలయం వద్ద బెంగళూరు నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న గుంటూరుకు చెందిన నజీర్, నవీద్, కాశీం, పర్వేజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. అలాగే చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపల్లె వద్ద జాతీయ రహదారిపై వెళుతున్న లారీ అకస్మాత్తుగా ఆగిపోవడంతో వెనుక వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐరాల మండలం గోవిందరెడ్డి పల్లెకు చెందిన కారు యజమాని ఉదయ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. 108లో క్షతగాత్రుడిని తిరుపతి రుయాకు తరలించారు. చంద్రగిరి పోలీసులు విచారణ చేపట్టారు.

గ్రామీణ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



సభ్యులకు రూ.10 కోట్ల బోనస్ చెక్ అందజేస్తున్న శ్రీజ సంస్థ నిర్వాహకులు, అతిథులు

- మహిళా చైతన్యానికి శ్రీజ సంస్థ కృషి అభినందనీయం
- మాజీ గవర్నర్ కిరణ్‌బేడీ వెల్లడి

తిరుపతి కల్చరల్: గ్రామీణ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, ప్రధానంగా పాడి రంగంలో చిన్నపాటి ఆర్థిక ఆర్జన చేస్తున్న మహిళలను ప్రోత్సహిస్తూ వారి చైతన్యానికి శ్రీజ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని పుదుచ్చేరి రాష్ట్ర మాజీ గవర్నర్ కిరణ్‌బేడి తెలిపారు. కరకంబాడి రోడ్డులోని ఓ ప్రైవేటు హోటల్‌లో శ్రీజ సంస్థ 10వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యూఢిల్లీ నుంచి కిరణ్‌బేడి వర్చువల్ విధానంలో శ్రీజ సంస్థ సభ్యులతో, అతిథులతో ముచ్చటించారు. దేశంలోని పాడి రైతుల ఆర్థిక అభివృద్ధికి శ్రీజ వంటి సంస్థలు నెలకొల్పాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అతిథిగా విచ్చేసిన అమర హాస్పిటల్స్ ఎండీ గొర్నానేని రమాదేవి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలకు ఇంతగా ప్రోత్సాహకాలు అందించి ఆర్థిక చైతన్యవంతుల్ని చేస్తున్న శ్రీజ సంస్థ కృషి అభినందనీయమన్నారు. మహిళల అభివృద్ధికి దోహదపడుతున్న శ్రీజ సంస్థ వారికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. శ్రీజ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జయతీర్థాచారి మాట్లాడుతూ 10వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీజ సభ్యులకు రూ.10 కోట్లు బోనస్‌ను ఆన్‌లైన్ పద్ధతిలో నగదు బదిలీ చేయడంతో పాటు అర్హులైన వారికి స్టీలు పాల క్యాన్లు అందించామని తెలిపారు. నెలలో రెండు సార్లు శ్రీజ సంస్థ సభ్యులకు నగదు చెల్లింపులు చేస్తున్నామని, ఇప్పటి వరకు రూ.3,600 కోట్లు వారి ఖాతాలకు జమచేసినట్లు వెల్లడించారు. శ్రీజ కంపెనీ అత్యుత్తమ విజయాలకు గుర్తింపుగా ప్రతిష్టాత్మకమైన సెక్స్ సార్టెడ్ సెమెన్ ప్రాజెక్టును రాయలసీమ ప్రాంతంలో అమలు చేసే ఏజెన్సీగా రాష్ట్రీయ గోకుల్ సేవా మిషన్ కింద ఎంపికైందన్నారు. ఈ ప్రాజెక్టు ఆగస్టు 15వ తేదీ ప్రారంభించనున్నట్లు తెలిపారు. టీఐఎస్ఎస్ మాజీ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీలింగం, గ్రాన్యూల్స్ ఇండియా గ్లోబల్ సీహెచ్ఆర్‌వో ఉమారావు, చిత్తూరు, తిరుపతి జిల్లాల డీఆర్‌డీఏ పీడీలు, డీఎంకే తులసి, జ్యోతి, శ్రీజ సంస్థ చైర్మన్ కె.శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు తక్షణ పరిష్కారం



అర్జీలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ బాలాజీ

తిరుపతి అర్బన్ : స్పందనలో వచ్చే ప్రతి అర్జీకి తక్షణ పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అర్జీదారులు తమ సమస్యలను తెలియజేయడానికి విచ్చేశారు. ఆన్‌లైన్ చేయించిన వినతులను జేసీతోపాటు డీఆర్‌ఓ కోదండరామిరెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు భాస్కర్‌నాయుడు, శ్రీనివాసులు పరిశీలించి అక్కడికక్కడే పరిష్కారం చూపించారు. స్పందనకు మొత్తం 160 అర్జీలు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు.

టీడీపీ నేత ఆక్రమణపై ఫిర్యాదు

శ్రీకాళహస్తి రూరల్ మండలం ఎంపేడులో 30 ఎకరాల ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన ఓ టీడీపీ నేత ఆక్రమించారని స్థానికులు ఫిర్యాదు చేశారు. 2013లో అప్పటి ఎమ్మెల్యే బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సహకారంతో కబ్జాకు పాల్పడినట్లు పేర్కొన్నారు. వినతిని పరిశీలించిన జేసీ వెంటనే అధికారులు విచారించి ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు.

ఎన్నికల విధుల అలసత్వంపై సీరియస్

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పరిధిలో ఈ ఏడాది మార్చి 13న ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించగా.. ఆ ఎన్నికల నిర్వహణలో తిరుపతి జిల్లా కేంద్రంలోని 229, 233 పోలింగ్ స్టేషన్‌లపై పలు అభియోగాలు వెల్లడయ్యాయి. దీంతో ఆ రెండు పోలింగ్ కేంద్రాల్లో అప్పట్లో రీ పోలింగ్ నిర్వహించారు. ఆ రెండు పోలింగ్ స్టేషన్‌లలో జరిగిన సంఘటనలపై తిరుపతి కలెక్టర్, ఎస్పీలు భారత ఎన్నికల సంఘానికి నివేదికలు పంపారు. ఆ నివేదికల ఆధారంగా పోలింగ్ రోజున విధుల పట్ల అలసత్వం వహించిన పీవో (ప్రిసైడింగ్ ఆఫీసర్లు), రెండు పోలింగ్ కేంద్రాల్లో విధుల్లో పాల్గొన్న సిబ్బందిని సస్పెండ్ చేయాలని ఏపీ చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ ముఖేష్‌కుమార్ మీనా ఈ నెల 7న ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వులను అమలు చేసేందుకు తిరుపతి కలెక్టరేట్ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

వామ్మో చిరుత



తుడా క్వార్టర్స్‌లో చిరుత సంచరించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న గుండ్రాజు శివశంకర్‌రాజు తదితరులు

తిరుపతి మంగళం : చిరుతను చూసి కేకలు పెడుతూ మంగళం తిరుమలనగర్‌లోని తుడా క్వార్టర్స్ ప్రజలు పరుగులు పెట్టారు. తిరుమలనగర్ పంచాయతీ తుడా క్వార్టర్స్‌లోని 261 ఇంటి వద్ద ఆదివారం రాత్రి చిరుత సంచిరించినట్లు స్థానికులు చెబుతున్నారు. కుక్కల అరుపులు, చెట్ల పొదల్లో అలజడి కనిపించడంతో ఆ పక్క ఇంటి వాళ్లు టార్చ్ వేసి చూడగా.. చిరుత కనిపించడంతో భయంతో బెంబేలెత్తిపోయారు. కేకలు పెడుతూ ఇళ్లల్లోకి వెళ్లి తలుపులు బిగించుకున్నారు. ఇంటి కిటికీలో నుంచి టపాసులు కాల్చి బయటకు విసురుతూ కేకలు పెట్టారు. తిరుమలనగర్ పంచాయతీలోని తుడా క్వార్టర్స్, హరిత కాలనీ ప్రాంతాల్లో తరుచూ చిరుత సంచరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. రెండు రోజుల క్రితం తుడా క్వార్టర్స్‌లోని 262 ఇంట్లో పెంచుకుంటున్న నాలుగు కిలోల నాటుకోడిని చిరుత నోటికి కరుచుకుని తీసుకెళ్లినట్లు ఆ ఇంట్లో నివాసం ఉంటున్న వారు తెలిపారు. రాత్రి తమ పక్క ఇంటి చెట్లల్లో చిరుత తిరుగుతుండడం తన కళ్లారా చేసినట్లు భాస్కర్ చెప్పారు. విషయం తెలుసుకున్న తిరుమలనగర్ పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు గుండ్రాజు శివశంకర్‌రాజు చిరుత సంచరించిన ప్రాంతంలో పర్యటించి పరిశీలించారు. ఇళ్ల పరిసర ప్రాంతాల్లోని ముళ్లపొదలను జేసీబీతో తొలగించాలని పంచాయతీ సిబ్బందికి చెప్పారు. ఆయనవెంట పార్టీ నాయకులు దయా, నాగరాజు, పంచాయతీ సిబ్బంది కిరణ్ ఉన్నారు.

ఘనంగా బిషప్ కౌన్సిల్ వార్షికోత్సవం



బిషప్‌లతో మంత్రి మేరుగు నాగార్జున

తిరుపతి కల్చరల్: ఓటేరులోని బెతస్థ ప్రార్థనా మందిరంలో సోమవారం ఏపీ బిషప్ కౌన్సిల్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంత్రి మేరుగు నాగార్జున ముఖ్య అతిథిగా పాల్గొని వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని క్రైస్తవుల సమస్యలను ఏపీ బిషప్ కౌన్సిల్ చైర్మన్ ఎలమంచిలి ప్రవీణ్ వివరించారు. క్రైస్తవ సంస్థలకి ఎఫ్‌సీఆర్‌ఏలు రద్దు చేశారని, వాటిని పునరుద్ధరించాలని మంత్రిని కోరారు. దళిత క్రైస్తవులకు శ్మశానాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై మంత్రి మేరుగు నాగార్జున సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో బిషప్ ఏజ్జల బాలరాజు, ప్రధాన కార్యదర్శి బిషప్ విక్టర్ పాల్, బిషప్ నవీన్‌కుమార్, బిషప్ సీహెచ్ మోజెస్ పాల్గొన్నారు.